క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అన్నారు. సోమవారం స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనిషి మాత్రమే రక్తదానం చేసి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎం. సౌమ్య, లావణ్య, వెంకటరమణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి



మొక్క నాటుతున్న వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, తదితరులు

డెంకాడ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్ అన్నారు. మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ పిలుపుమేరకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ సరుకులు



మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కరరావు

పూసపాటిరేగ: లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని తహసీల్దార్ ఇ. భాస్కరరావు అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ వాహనాలు ప్రతి ఇంటి వద్దకు తీసుకెళ్లి సరుకులు పంపిణీ చేయాలన్నారు. తూకంలో తేడాలకు పాల్పడకుండా సకాలంలోనే సీళ్లు వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భోగాపురం పౌరసరఫరాల శాఖ అధికారి మురళి, రేషన్ డీలర్లు ఉన్నారు.

చంద్రబాబు నిర్వాకంతో అమాయకులు బలి



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న రామారావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాల్పులు జరిపించారని, దీంతో ఎంతోమంది అమాయకులు మృతి చెందారని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు అన్నారు. పట్టణంలోని విద్యుత్ స్టోర్ వద్ద విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించమనడమే వారి ప్రాణాల పాలిట శాపమైందన్నారు. అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హమాలీ సంఘ నాయకులు పతివాడ లక్ష్మణరావు, పెద రాంబాబు, లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా జగనన్న...

- విద్యాదీవెన నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి
- సర్వత్రా హర్షాతిరేకాలు

విజయనగరం అర్బన్:

పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోంది. ఫీజులు చెల్లించలేక ఆయా వర్గాలకు చెందిన విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగపోకూడదనే దృఢ సంకల్పంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తోంది. అలాగే వివిధ కోర్సులు చదువుతున్న అర్హత కలిగిన విద్యార్థులందరికీ ఆహారం, హాస్టల్, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం జగనన్న వసతిదీవెన పథకాన్ని కూడా అమలు చేస్తోంది. ఈ రెండు పథకాలకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తోంది. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, తదితర వర్గాలకు చెందిన విద్యార్థులు డ్రాపవుట్స్ లేకుండానే ఐటీటీ, పాలిటెక్నిక్, డిగ్రీ, తదితర కోర్సులు చదువుతున్నారు. మొదటి విడతగా ఈ ఏడాది ఏప్రిల్ 26న జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా విజయనగరం నియోజకవర్గ పరిధిలోని ఆయా సామాజిక వర్గాలకు చెందిన 5,459 మంది విద్యార్థులకు రూ.5.27 కోట్లను (ఫీజులు) ప్రభుత్వం జమ చేసింది. అలాగే రెండో విడతగా మే నెల 24న విజయనగరం నియోజకవర్గ పరిధిలో 5,032 విద్యార్థులకు రూ.4.34 కోట్లను విడుదల చేసింది. తాజాగా సోమవారం మూడో విడతగా 5,263 మంది విద్యార్థులకు రూ.3.95 కోట్లను జమ చేసింది. ఆయా నిధులు విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలకు జమవుతున్నాయి.



విద్యార్థులు (ఫైల్)

విడతల వారీగా విడుదలైన నిధులు..

విడత	విద్యార్థులు	జమైన నిధులు
మొదట విడత	5,459	రూ.5.27 కోట్లు
రెండో విడత	5,032	రూ.4.34 కోట్లు
మూడో విడత	5,263	రూ.3.95 కోట్లు

ప్రభుత్వ సహకారంతో చదువులు..



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోనే మా చదువులు కొనసాగిస్తున్నాం. జగనన్న విద్యాదీవెన పథకం కింద రూ.13వేల చొప్పున నాలుగు విడతల సహాయాన్ని పొందాను. ప్రైవేట్ కళాశాలలో ఫీజు కట్టలేమోనని భయపడుతూ కళాశాలలో చేరాను. అయినప్పటికీ ప్రభుత్వం ప్రతి ఏటా సహాయాన్ని అందిస్తూ మా చదువులు చక్కగా సాగేందుకు సహకరిస్తోంది. నాలాంటి ఎంతోమంది విద్యార్థులు సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

లెంక మాధవి, డిగ్రీ థర్డ్ ఇయర్, సీతారామునిపేట గ్రామం, నెల్లిమర్ల మండలం

విద్యా దీవెనతో చేయూత...



ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాదీవెన పథకంతో మా లాంటి ఎంతోమంది విద్యార్థులకు చేయూత లభిస్తోంది. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. విద్యాదీవెన నగదు ఎంతో ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సహకారం మరువలేనిది.

– గాదిపల్లి భారతి, పెదతాడివాడ, డెంకాడ మండలం

బంగారుబాట..



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పిల్లల భవిష్యత్‌కు బంగారుబాట వేశారు. నాకు ఇద్దరు పిల్లలు సాయితేజ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం, శ్రావణి డిప్లమో మూడో సంవత్సరం చదువుతున్నారు. విద్యా దీవెన సాయంతో పిల్లలను చదివించుకుంటున్నాను. జగనన్నకు రుణపడి ఉంటాం.

– ముని గౌరీశ్వరి, బూడివీధి, పూసపాటిరేగ

ప్రత్యేక ధన్యవాదాలు..



కుటుంబ ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రమే అయినప్పటికీ డిగ్రీ ఆ పై ఉన్నత చదువులు చదువుకుంటున్నామంటే అందుకు ప్రభుత్వ సహకారమే ముఖ్య కారణం. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సీఎం జగనన్న చేస్తున్న కృషి మా లాంటి ఎంతో మంది విద్యార్థులకు వరంలా మారింది. డిగ్రీ మూడో ఏడాది చదువుతున్న నాకు ప్రతి ఏటా ప్రభుత్వ సాయం అందింది. సొంత అన్నలా అండగా నిలిచిన జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు.

కుమరాపు అమూల్య, డిగ్రీ విద్యార్థిని, దేవుని నెలివాడ గ్రామం, నెల్లిమర్ల మండలం

జగనన్న భరోసాతోనే చదువుకుంటున్నా..



జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా నేను ప్రతి ఏటా లబ్ధి పొందుతున్నాను. ప్రస్తుతం మహారాజా పీజీ కళాశాలలో డీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుకుంటున్నాను. ఒక్కో విడతలో రూ.6,250 చొప్పున, మూడు విడతల్లో రూ. 18,750 బ్యాంక్ ఖాతాలో జమైంది. మా చెల్లికి కూడా అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతోంది.

– మజ్జి చంద్రకళ, డీ ఫార్మసీ విద్యార్థిని, రామతీర్థం, నెల్లిమర్ల మండలం

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం..

విజయనగరం పూల్‌బాగ్: విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి టి. సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2000 ఆగస్టు 28న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో బషీర్‌బాగ్ వద్ద చంద్రబాబునాయుడు ప్రభుత్వం పాశవికంగా కాల్పులు జరిపిందన్నారు. ఇందులో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి అమరులయ్యారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, జగన్, సీఐటీయూ కార్యదర్శి బి. రమణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు



లబ్ధిదారులకు రేషన్‌కారులు అందజేస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: కుటుంబ వ్యవస్థలో కీలకమైన రేషన్ కార్డులను అర్హులైన వారందరికీ అందజేస్తున్నట్లు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 14వ డివిజన్ పరిధిలో నూతనంగా రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారులకు డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్‌తో కలిసి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పొందాలంటే తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఈ నేపథ్యంలో అర్హత ఉండి తెల్ల రేషన్‌కార్డు పొందలేని వారి వివరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిశీలించి వారికి మంజూరయ్యే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో 'నాకా బందీ'



తోటపాలెం వద్ద నాకాబందీలో భాగంగా తనిఖీలు చేపడుతున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నాకాబందీ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అయ్యన్నపేట, దుప్పాడ జంక్షన్, జేఎన్‌టీయూ, సీఎంఆర్, ఆర్అండ్‌బీ, తోటపాలెం, సింహాచలం మేడ జంక్షన్, బొడ్డు కళావతి జంక్షన్, వైఎస్సార్ జంక్షన్, కొత్తపేట నీళ్ల ట్యాంక్, రాజీవ్ నగర్, లంకాపట్నం, బీసెంట్ స్కూల్, వై జంక్షన్, జమ్ము జంక్షన్, ధర్మపురి జంక్షన్, మిమ్స్ కళాశాల జంక్షన్, తదితర ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. గంజాయి రవాణా, మైనర్లు బైక్‌పై విచ్చలవిడిగా సంచరించడం, నంబర్ ప్లేట్లు లేకుండా రాకపోకలు సాగించడం, డ్రంకన్ డ్రైవ్, ఈ చలానాలు చెల్లించని వారిని పట్టుకుని అపరాధ రుసుం విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చశారు. నాకా బందీలో సీఐలు, ఎస్సైలు, క్రైమ్ పార్టీ, హెచ్‌సీలు, పీసీలు, ఏఆర్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీల నిరసన



కలక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

విజయనగరం పూల్‌బాగ్: సివిల్ సప్లై హమాలీల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్‌లెస్ట హమాలీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు ఆర్అండ్‌బీ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా అధ్యక్షుడు ఎం. నరసింహులు, ఏఐటీయూసీ నాయకుడు పి. అప్పారావు, హమాలీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



వల్లూరులో ప్రచారం చేస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

నెల్లిమర్ల రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని మండలంలోని వల్లూరు, మల్యాడ, తరిమి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు శంకరరావు, సభ్యులు రాజప్పడు, సూరిబాబు, రాజేష్, వంశీ, గీతారాణి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రూ.9.78లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెరకముడిదాం: మండలంలోని చినరవ్వాం గ్రామంలో రూ.9.78 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లికృష్ణ సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. గ్రామా ల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభు త్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. గ్రామంలో గతంలో పనులు ప్రారంభించి అర్ధంతరంగా విడిచిపెట్టేసిన అంగన్‌వాడీ భవ న నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.9.60 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు.

ఆక్రమణలపై ఫిర్యాదు



ఎంపీడీఓ రామారావుకు ఫిర్యాదు చేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణరాజు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్. అగ్రహారం పరిధిలో జాతీయరహదారిని ఆనుకుని ఉన్న ఊరచెరువును ఆక్రమించారని వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు ఆరోపించారు.ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఎంపీడీఓ జి. రామారావుకు ఫిర్యాదు చేశారు. అలాగే కోనాడ గ్రామంలోని తమ్మన్నకోనేరు గట్టులో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, సర్వే నంబర్ 44–2లో ఆక్రమణలు చోటుచేసుకున్నాయని కారి అప్పలరాజు, తదితరులు ఫిర్యాదు చేశారు.

చెరువు కబ్జాపై..

డెంకాడ: పెదతాడివాడ పంచాయతీ పరిధిలోని నారాయణరాజు చెరువును రియల్ వ్యాపారి అక్రమించారని.. దీనిపై విచారణ జరిపి ఆక్రమణలను తొలగించాలని పెదతాడివాడ పంచాయతీ పరిధి గుండాలపేట గ్రామానికి చెందిన రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. చాలా మంది ఈ చెరువుపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారని, ఇప్పుడు చెరువు ఆక్రమణకు గురికావడం వల్ల వారంతా ఇబ్బంది పడుతున్నారన్నారు. రాత్రి వేళల్లో చెరువు గట్టును కూడా తవ్వేస్తున్నారని పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగత రమణ తెలిపారు.

భూముల రీ సర్వే ప్రారంభం

- నగరంలోని 14వ డివిజన్ నుంచి శ్రీకారం
- సర్వే ప్రక్రియను ప్రారంభించిన నగర మేయర్ విజయలక్ష్మి



14వ డివిజన్ పరిధిలో పూజలు నిర్వహించి భూముల రీ సర్వే ప్రక్రియను ప్రారంభిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి, తదితరులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వే విజయగనరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రారంభమైంది. జగనన్న శాశ్వత భుహక్కు, భూ రక్ష అమలు ప్రక్రియలో భాగంగా రీ సర్వే ప్రక్రియకు సోమవారం 14వ డివిజన్ 17వ నంబర్ సచివాలయ పరిధిలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు శ్రీకారం చుట్టారు. ముందుగా పూజలు నిర్వహించి సర్వేను ప్రారంభించారు. అనంతరం ఆస్తిదారులకు రెండు రకాల నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న భూ హక్కు భూ రక్ష పథకాన్ని ప్రారంభించిందన్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి విజయనగరంలో రీ సర్వే ప్రారంభమైందని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ పట్ల ప్రజలు అపోహలు వీడి అధికారులకు సహకరించాలని కోరారు. భవిష్యత్‌లో ఎటువంటి భూ తగాదాలు, ఇబ్బందులకు తావు లేకుండా సంపూర్ణ హక్కులతో ఆన్‌లైన్ విధానంలో అనుసంధానం చేసి ఆస్తిదారులకు భూహక్కు పత్రాలను అందించడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, 52 చదరపు కిలోమీటర్ల మేర నగర పరిధి వ్యాపించి ఉండగా... గతంలో 1917 నుంచి 1922 మధ్యలో అప్పట్లో నిర్వహించిన సర్వే రికార్డులతోనే భూ వ్యవహారాలు నడుస్తున్నాయన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు రీసర్వే ప్రారంభమైందని.. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మారోజు శ్రీనివాసరావు, దాసరి సత్యవతి, కనకాల నాగవల్లి, మీసాల రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐసరపు రామకృష్ణ, శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, సర్వేయర్ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



ఆస్తి యజమానులకు నోటీసులు అందజేస్తున్న మేయర్, తదితరులు

ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తనలు



అన్నమాచార్య సంకీర్తనలు ఆలపిస్తున్న గాయనీ,గాయకులు

విజయనగరం టౌన్: శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక శివాలయంవీధిలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనలు, భక్తిగీతాలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంస్థ వ్యవస్థాపకుడు ఎమ్. భీష్మారావు సారథ్యంలో వర్ధమాన గాయనీ, గాయకులు అద్భుతమైన గానాలాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నమయ్య సంకీర్తనలు ఉచితంగా నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారు కస్పా హైస్కూల్ వద్దనున్న ఘంటసాల స్మారక కళాపీఠంలో పేర్లను నమోదుచేసుకోవాలని కోరారు. అనంతరం ఆలయ నిర్వహకులు ఆయన్ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో తనిఖీలు

బొండపల్లి:

మండలంలోని దేవుపల్లి, బొండపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ డిపో ఎస్ఐ ఎస్.నర్సింహులు, విజిలెన్స్ ఎస్ఐ డి.గంగాధర్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. దేవుపల్లిలోని దుకాణం వల్ల ఇబ్బందులు పడుతున్నామని చుట్టు పక్కల దుకాణాలు వారు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేయడంతో దుకాణాలను పరిశీలిస్తున్నామని వారు తెలిపారు. దేవుపల్లిలోని దుకాణానికి ప్రహరీ నిర్మించాలని సంబంధిత భవన యజమానికి సూచించామని తెలిపారు. దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.